18 వ వసంతంలోకి

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు | తిరుపతి

శుక్రవారం | 30 ఆగస్టు 2024 | పేజీలు 8


# శ్రీవారి లడ్డూ పాలసీలో ఎలాంటి మార్పు లేదు

- లడ్డూలకు ఆధార్ అనుసంధానం
- టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి



**తిరుమల మేజర్‌న్యూస్:** శ్రీవారిలడ్డూ పాలసీలో ఎలాంటి మార్పు లేదు, స్వామి వారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి ఒక్క లడ్డు ఉచితం. భక్తుల అవసరానికి అనుగుణంగా లడ్డూలు వితరణ చేస్తున్నాం. మా పరిశీలనకు వచ్చిన అంశాల మేరకు చిన్న మార్పు తీసుకొచ్చాం. భక్తులే కాకుండా దళారులు అధికంగా లడ్డూలను కొనుగోలు చేసి అధిక ధరలకు భయట విక్రయిస్తున్నారని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు. దర్శనానికి వెళ్లకుండా లడ్డూలను కొనుగోలు చేసే వారికి ఆధార్‌పై రెండు లడ్లు మాత్రమే విక్రయిస్తాం. ఈ విధానం ద్వారా సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత

మిగతా 2లో

## విద్యార్థులకు విద్యను నేర్పే పాఠశాలల్లో

# మద్యపానం నేర్పిస్తున్న ఉపాధ్యాయులు



- కడపల్లి గురుకుల పాఠశాలలో రాత్రిపూట మద్యం సరఫరా..
- అభం, శుభం తెలియని విద్యార్థుల జీవితాలతో చలగాటం...



శాంతిపురం మేజర్‌న్యూస్: కుప్పంనియోజకవర్గం, శాంతిపురం మండలం, కడపల్లి గురుకుల పాఠశాల నందు అభం శుభం తెలియని విద్యార్థులకు కొంతమంది ఉపాధ్యాయులు రాత్రి సమయాల్లో బయట నుంచి మద్యంను పాఠశాలకు తీసుకొచ్చి చదువు నేర్పే ఉపాధ్యాయులు పిల్లలకు మద్యం తాగడం నేర్పిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో అయితే విద్యార్థులు ఏకంగా గంజాయికే అలవాటు పడి మత్తులో తేలుతున్నారు. ఇన్ని తెలిసినా పాఠశాల యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకపోవడం చాలా దారుణమని కొంతమంది పిల్లలు వారి తల్లిదండ్రులకు

మిగతా 2లో









# అణువణువునా అక్రమణలే!



- తిరుపతిలో జరుగుతున్న పనుల్లోనూ నాణ్యత ప్రశ్నార్థకం?
- అధికారులు కాస్తంత దృష్టి సారించాలి

**తిరుపతిసిటీ మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి, తిరుమలకు రోజువారీలో భక్తులు, ప్రయాణికులు ఒక లక్షకు ఏమాత్రం తగ్గకుండా దైవదర్శనం కోసం శ్రీవారి ఆలయ దర్శనానికి వస్తుంటారు. అలాగే ఇతరేతర పలు రకాల కారణాలతో నగరానికి మరో లక్షమంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలా రోజుకు రెండు లక్షలకు తగ్గకుండా తిరుపతి నగరంలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే రోజు రోజుకు పెరిగి పోతోన్న జనాభాకు అనుగుణంగా నగరం తగినంత వేగంగా అభివృద్ధి జరిగినట్టుగా కనిపించటంలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తిరుపతి నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది అంటూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు చేసే హడావుడి తప్ప ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది నగరంలో అభివృద్ధి పరిస్థితి. రాజకీయ నాయకులు చెప్పే మాటలకు, చేతులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే అభివృద్ధి చెందుతున్న కొంత భాగాన్ని అయినా సరే చక్కగా ఉంచుకుందామన్న ధ్యాస అటు నగర ప్రజలలోను, ఇటు అధికారుల్లో మచ్చుకైనా కనిపించలేదని పిస్తుంది. స్మార్ట్ సిటీలో భాగంగా నగరం అభివృద్ధికై కేంద్రం, తిరుమల దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి అభివృద్ధి కోసం

అంటూ ఇప్పటికే బారిగా ఖర్చు

మిగతా 02







## మద్యపానం నేర్పిస్తున్న ఉపాధ్యాయులు

(మొదటి పేజీ తరువాయి...)

పాఠశాలలో జరుగుతున్న విషయాలను తెలియజేయగా, ఈ విషయాన్ని కొంతమంది ఉపాధ్యాయులకు తెలియజేశారు. అయినా మా స్కూల్లో అలాంటివేమీ జరగలేదని, క్రమశిక్షణగా ఉందంటూ, ఏదైనా జరిగితే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినా ఈ పాఠశాలలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మా పిల్లల భవిష్యత్తు బాగుపడాలని కూలి పనులు చేసుకుంటూ మా బిడ్డలను భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్మించిన గురుకుల పాఠశాల నందు చేర్పించామని, అయినా కుప్పం నియోజకవర్గం పరిధిలోని గురుకుల పాఠశాలలో ఎక్కువగా మద్యం మత్తులో విద్యార్థులు మునిగి తేలుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీవారి లడ్డూ పాలసీలో ఎలాంటి మార్పు లేదు

(మొదటి పేజీ తరువాయి...)

ఇవ్వవచ్చు. దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడికి అదనంగా 4 లడ్డూలను ఇచ్చేలా చర్యలు. అందుబాటులో ఉన్న లడ్డూలకు అనుగుణంగా లడ్డూ వితరణ సాగుతుంది. సామాన్య భక్తుడికి ఇది ఉత్తమ నిర్ణయం, దళారులకు ఇది చేదు నిర్ణయం .

## జాతి మనుగడ మాతృభాషతోనే సాధ్యం



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** జాతి మనగడ సాధించాలంటే అది మాతృభాషతోనే సాధ్యమని వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న అన్నారు. గురువారం వెదురు కుప్పంలోని డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్స వాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యవహారిక భాషకు మెరుగులు దిద్దిన గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. మాతృభాషను ప్రతి విద్యార్థి గౌరవించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతులైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిచ్చి కుక్క సుధాకర్ ను సమాజం నుంచి బహిష్కరించాలి

**-టిడిపి సీనియర్ నేత ఊట్ల సురేంద్ర నాయుడు**



**తిరుపతి అర్బన్, మేజర్‌న్యూస్:** ముంబై హీరోయిన్ కాదంబరి జట్మలాని ప్రేమ పేరుతో వంచించి, అనుభవించి గత వైసిపి ప్రభుత్వపాలనలో ఆమె కుటుంబ సభ్యుల మొత్తాన్ని హింసించి.. నిజాలను బయటకు చెబితే వారిని హతమారుస్తామని భయపెట్టిన కుక్కల సుధాకర్‌ని సమాజం నుండి వెలివేయాలని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేందర్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియా ముందు టిడిపి నాయకులు విశ్వనాథం,రాజారామ్, ధనుంజయ్, గౌస్ బాషా,జనసేన నాయకుడు సాయి తదితరులతో కలిసి ఊట్ల సురేంద్ర నాయుడు మాట్లాడుతూ..గత వైసిపి పాలనలో ఏపీ సలహాదారులు మరియు ఐపీఎస్ అధికారులు, పోలీసు యంత్రాంగం ఈ పిచ్చికుక్క సుధాకర్ కు సహకరించి హీరోయిన్ కుటుంబాన్ని నిలువునా ముంచారని ఆరోపించారు. వైకాపా పాలనలో బాదింపబడ్డ కుటుంబాలు రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే.. వారికి న్యాయం చేస్తారని కొనియాడారు.ఈ పిచ్చి కుక్కల సుధాకర్‌కు కఠిన శిక్ష విధించాలన్నారు.అప్పుడే మరొకరు ఇలాంటి ఘటనలకు పాల్పడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రజా ప్రభుత్వంతో రాష్ట్రం సుభిక్షంగా తులతూగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మంత్రి రాం ప్రసాద్ రెడ్డిని కలసిన యస్కే రమణారెడ్డి



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని ప్రముఖ తెలుగుదేశం నాయకులు,పురాతన దేవాలయాల నిర్మాణ దాత యస్కే రమణారెడ్డి ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజక వర్గంలో పురాతన దేవాలయాలు నిర్మాణానికి సహాయ సహాకారాలు అందివ్వగలని కోరడం జరిగింది.

## డొక్క సీతమ్మ అన్నదానంలో జనసేన ఇంచార్జ్ కోట వినుత



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి శ్రీమతి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతి గురువారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 7 వవారం బస్టాండ్ సెంటర్లో వినుత కోటా అతిథిగా పాల్గొని 500 మందికి అన్నదానం నిర్వహించడం జరిగింది. పేట చంద్ర శేఖర్, చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.





# అణువణువునా ఆక్రమణలే !

(మొదటి పేజీ తరువాయి...)

చేశారు, చేస్తున్నారు. అయినా అను కున్నంత అభివృద్ధి చెందలేదు అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . స్మార్ట్ సిటీ పేరుతో సుమారు ఎనిమిది సంవత్సరాలుగా పనులు చేస్తున్నా ఇప్పటి వరకు అనుకున్నంత స్థాయిలో పనులు జరిగటం లేదన్నది వాస్తవం. జరిగిన పనుల్లోనూ ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనిపిస్తుంది. అధికారులు పర్యవేక్షణ లోపమో లేక నాయకుల వ్యాపారమో కాని చేసిన పనులే తిరిగి తిరిగి అదే పనులను చేస్తూ నగర ప్రజలకు విసుగు పెట్టిస్తున్నారు. గత ప్రభుత్వంలో సుమారు పదునాలుగు మార్గాలను కలుపుతూ, కొత్తగా వేసిన రోడ్లును పరిశీలిస్తే అర్థమవుతుంది. ఎంత లోపభూయిష్టంగా ఉంటుందో. ఎన్నో రాజకీయ విమర్శలను సమర్థంగా ఎదుర్కొంటూ గత పాలకులు అతికష్టంమీద ఎంతో ప్రయాసపడి వేసిన రోడ్లను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీదా ఉంది. అది మన బాధ్యత కూడాను. కొత్తగా వేసిన రోడ్లుతో నగరంలో చాలా వరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయినా వేసిన రోడ్లను ఎక్కడ పడితే అక్కడ పడితే అక్కడ మళ్ళీమళ్ళీ త్రవ్వేస్తూ గుంతలు మయం చేస్తున్నారు. అవసరానికి అనుగుణంగా త్రవ్వకున్నా వాటిని సరిగ్గా పూడ్చిపెట్టక అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనా దారులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే నగర సుందరీ కరణంలో భాగంగా, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రధానమైన రోడ్లకు ఇరువైపులా ఫుట్ పాత్ లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఫుట్ పాత్ లను పూర్తిగా వ్యాపార సముదాయాలుగా వాడు కుంటున్నా, అటు మున్సిపాలిటీ కాని ట్రాఫిక్ పోలీసులు కాని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఫుట్ పాత్ లపై ఏ మాత్రం నడవటానికి దారి లేకుండా ఆక్రమించేసారు. నగరంలో ఫుట్ పాత్ లన్నీ ఇక్కడ అక్కడ అని కాకుండా పూర్తిగా వ్యాపార సంస్థల చేతుల్లో చిక్కుకున్నాయి . నగరంలోని రోడ్లు మొత్తం ఆక్రమణుల చేతిలో ఉంటూ కోట్లు రూపాయలు ఖర్చు పెట్టిన ప్రభుత్వం షాపుల ముందు ఉంటున్న ఫుట్ పాత్ లను వ్యాపారస్తులు వారికి అనుకూలంగా మలుచుకుని సుందరీ కరుణను నాశనం చేస్తున్నారు. లాడ్జీల వాళ్ళు అయితే తమ లాడ్జీల్లో రూములు తీసుకున్న పుణ్యానికి వారి వాహనాలను ఫుట్ పాత్ లపైనే పార్కింగ్ చేపించేస్తూ నాశనం చేస్తున్నారు. హొటల్స్ వారు, లాడ్జీల వాళ్ళు వారికి ఆదాయం వస్తుంది . వేసిన ప్రభుత్వానికి మాత్రం నష్టం వాటిల్లుతుంది. అంతేకాకుండా సుందరికరణ సైతం పూర్తిగా దెబ్బతింటున్నాయి. బహిరంగంగా ఇంత జరుగుతున్నా సంబంధించిన అధికారులు ఎవ్వరికీ కనిపించక పోవడాన్ని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.





## సీఎన్‌ఆర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

**గుడిపాల, మేజర్ న్యూస్:** స్థానిక సీఎన్‌ఆర్ కళాశాలలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి పంతులు పుట్టినరోజును ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల మేజిస్ట్రేట్ మరియు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన తెలుగు భాష దేశ భాషలలోనే గొప్పది అన్నారు. అందుకే శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని తెలియజేసారు.తెలుగు అనే పదంలో ఎంతో తీయదనం ,మాధుర్యం ఉంది అన్నారు. తేనెలొలుకు భాష తెలుగు పలుకు భాష అన్నారు. వాడుక భాషలోనే పాఠ్యాంశాలు ఉండాలని ఉద్యమించిన వ్యక్తి అన్నారు. ఈరోజు అతని కృషి వలన విద్యార్థులు ఎంతో సులభంగా తెలుగు భాషను నేర్చుకుంటున్నారన్నారు. పర భాషలను నేర్చుకున్న మన మాతృభాషను మరచిపోకూడదన్నారు. విదేశీయులు సైతం కొనియాడబడిన భాష మన మాతృభాష. విద్యార్థులు మాతృభాష మీద అభిమానం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వంశీకృష్ణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్, కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ తెలుగు ఉపాధ్యాయులు కోదండమ్ ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు భాషకు గిడుగు కృషి అభినందనీయం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** వ్యవహారిక భాషో ద్యమానికి జీవితాన్ని అర్పించిన మహాను భావుడు గిడుగు రామ్మూర్తి పంతులని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ స్పష్టం చేశారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా ప్రిన్సిపల్ నారాయణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సవర భాషకు లిపిని ఆవిష్కరించి నిఘంటువు రూపకల్పన చేసిన ఆయన అందరికీ ఆదర్శమన్నారు. డాక్టర్ ప్రేమావతి మాట్లాడుతూ గిడుగు ఉద్యమకారుడు మాత్రమే కాదని జీవితాన్ని ఉద్యమంగా మార్చుకున్న దిశాలి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతూ మాతృభాషలో ప్రావీణ్యత సాధిస్తూ ధరభాషలను సులభంగా నేర్చుకోవాలన్నారు. తెలుగు విభాగ్యపతి డాక్టర్ వి కృష్ణవేణి మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని తెలుగు భాషను పొంచి ఉన్న ప్రమాదాన్ని విద్యార్థులకు తెలియజేసి గిడుగు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సి భువనేశ్వరి దేవి మాట్లాడుతూ భాషాభివృద్ధికి తోడ్పాటు ఇటువంటి కార్యక్రమాలు విరివిగా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎల్ కస్తూరి, డాక్టర్ ఓ అన్నమ్మ, యూనియన్ ఇంచార్జి డాక్టర్ బి జ్యోతి, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ సాయికుమారి, డాక్టర్ సునీత, డాక్టర్ శిరీష, డాక్టర్ దివ్యవాణి, జ్ఞాన ప్రసూన, డాక్టర్ నిర్మల, డాక్టర్ భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షల విలువైన టాటా వాహనం విరాళం



**తిరుమల, పలమనేరు, మేజర్‌న్యూస్:** టీటీడీకి గురు వారం ఉదయం రూ.10 లక్షల విలువైన టాటా యోధ 1700 బిఎస్ విఐ రవాణా వాహనాన్ని పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి అందజేశారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట వాహనానికి పూజలు నిర్వహించి, తాళాలను అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే గోవిందప్ప, తిరుమల డిఐ సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గంగిరెడ్డిపల్లి రైతు సేవ కేంద్రం తనిఖీ



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కమిషనరేట్ అగ్రికల్చర్ ఈ- పంట నోడల్ అధికారి విజయ భారతి, రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రం తనిఖీ చేశారు. తనిఖీ లో భాగంగా మండలంలోని వ్యవసాయ సిబ్బంది అందర్నీ కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వరి పంటలో ఈ పంటను గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని స్రవంతి, జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారిని హరిత, పుత్తూరు డివిజన్ సాంకేతిక వ్యవసాయ అధికారిని హరిత మరియు రామచంద్రాపురం మండల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## స్త్రీల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు

**గుడిపాల, మేజర్ న్యూస్:** జడ్పీ హైస్కూల్ నరహర పేట నందు (రాష్ట్రీయ కిషోర్ స్వస్థత కార్యక్రమం) జరుపబడినది .ఇందులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ సంధ్యా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ బాలికలకు పర్సన్ హైజాన్ మీద అవగాహన కల్పిస్తూ ఆడపిల్లలకు సరియైన వివాహమైన వయసు (ఏజెంట్ మ్యారేజ్ ) గురించి తెలియపరచడం జరిగినది. అదే విధంగా ఆడపిల్లలకు రక్తహీనత లోపం మరియు న్యూట్రిషన్ డైట్, పౌష్టిక ఆహారం గురించి తెలియపరచడం జరిగినది. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జబసిల్వి, ఉమా, సుజమ, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.



## తెలుగు మాధుర్యాన్ని నేటి తరానికి అందిద్దాం



**పలమనేరు, మేజర్‌న్యూస్:** తెలుగు భాషా మాధుర్యాన్ని నేటి తరానికి రుచి చూపించడానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాల్సినఅవసరం ఎంతైనా ఉందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పలమనేరు గంగవరం మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించి 100 మంది విద్యార్థులకు జ్ఞాపికలు పుస్తకాలు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలకు వీలయి నన్ని పద్యాలు కథలు సూక్తులు సామెతలు పొడుపు కథలులాంటివి నేర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో తులసీనాదం నాయుడు ను సత్కరించారు.

## ఘనంగా క్రీడా, భాషాదినోత్సవం



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** పట్టణం లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం, భాషా దినోత్సవం నిర్వహించారు. పురవీధులలో విద్యార్థులు అందరూ కలిసి మేజర్ ధ్యాన్ చంద్ జయంతి పురస్కరించుకొని తన యొక్క ఔన్నత్యాన్ని చాటుతూ పురవీధుల్లో క్రీడాజ్యోతి ఊరేగించారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా సాంప్రదాయ దుస్తులను ధరించి వెంకట గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసినటువంటి సేవను కొనియాడారు ప్రధానోపాధ్యాయులు నాగరాజు రెడ్డి ప్రసంగిస్తూ అమ్మ చేతిలో గోరుముద్ద తెలుగు రుచి గారాల పాల ముద్ద తెలుగు అని కొనియాడారు తెలుగు భాషకు వెంకట గిడుగు రామ్మూర్తి చేసినటువంటి సేవను మరియు క్రీడలకు మేజర్ ధ్యాన్ చంద్ చేసినటువంటి సేవను ఉపాధ్యాయులు అందరూ కొనియాడుతూ విద్యార్థులకు చక్కగా వివరించడం జరిగినది విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టడం జరిగినది ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర బాబు తెలుగు ఉపాధ్యాయులు మునిరత్నం, శివశంకర్ రెడ్డి. రమణప్ప. విజయలక్ష్మి. అరుణ కుమారి. సుధాకర్. మురళి, ఈశ్వర్ పాల్గొన్నారు.

## చెట్లు నరికివేతకు అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికివేతకు అనుమతి ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో చెట్లు నరికివేతపై గురువారం యూనివర్సిటీ రిజిస్టర్ ఆచార్య భూపతి నాయుడుకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ లు మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 258 చెట్లను నరికి వేయడానికి ఉపకులపతి ఉత్తర్వులు జూలై 2023 అప్పటి యూనివర్సిటీ ఇన్చార్జి ఇంజనీరు పేరుతో ఉత్తర్వులు విధులు చేశారన్నారు. అయితే 24 నవంబర్ 2023 లో అప్పటి ఉపకులపతిగా రాజారెడ్డి పదవి కాలం పూర్తయిందని చెప్పారు. అనంతరం 27వ తేదీ 12 నెల 2023లో ఉపకులపతిగా ఆచార్య శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారన్నారు. అయితే ఆయన పదవీ కాలం 18వ తేదీ జూలై నెల 2024లో ముగిసిందని, ఏడో తేదీ 12వ నెల 24 వరకు ఇన్చార్జి విసీగా ఎవరు లేకపోయినా ఉపకులపతి పేరుతో ఆయన సంతకం లేకుండా ఉత్తరాలు ఎలా ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికి వేయడానికి అనుమతి ఇచ్చిన మాజీ రిజిస్ట్రార్ హుస్సేన్, ఇంచార్జ్ ఇంజనీర్ పై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎనిమిది నెలల క్రితం ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తుతం ఆ పని చేయడానికి ఎవరు అనుమతిచ్చారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, యూనివర్సిటీ పచ్చదనాన్ని, యూనివర్సిటీ పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. గతంలో విసి రాజారెడ్డి పాలనలో వర్సిటీలోని వివిధ రకాలైన సంపదను బయట వ్యక్తులు దోచుకుపోవడం బాధాకరమన్నారు. వర్సిటీ విసిగా ఉండి ఆచార్య రాజారెడ్డి వర్సిటీలోని సహజ వనరులను ఇతరులు దోచుకుంటుంటే కూడా చూస్తూ ఉండిపోవడం దారుణమన్నారు. ఆయన పరిపాలనలో వర్సిటీ అక్కడ మీకు పరంగా కూడా పూర్తిస్థాయిలో దెబ్బతినిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పరిపాలనా కాలంలో విద్యార్థులకు, పరిశోధకులు, వర్సిటీ సిబ్బందికి వర్సిటీలో ఎటువంటి భద్రత లేకపోవడం విడ్డూరమన్నారు. ప్రస్తుతం వచ్చిన ఉన్నతాధికారులైన వర్సిటీ విద్యార్థులకు, బోధన, భోదనేతర సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన రిజిస్ట్రార్ భూపతి నాయుడు దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లేనిపక్షంలో దశల వారి ఉద్యమాలకు శ్రీకారం చూడతామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి

**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామ మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వహణలోని గురువారం శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల తెలుగు విభాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ, గ్రాంధిక భాషలో వున్న తెలుగును ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి తెలుగు భాషలోని మకరందాన్ని సులభతరంగా ప్రజలకు అందించిన మహనీయులు గిడుగు రామమూర్తిని



కొనియాడారు. ప్రపంచ భాషల్లోనే తెలుగు భాష, లిపి ప్రత్యేకత కలిగినదని,భావ వ్యక్తీకరణకు అత్యంత సులభతరమైన భాషగా గుర్తింపు వున్నదని, తెలుగులో మాట్లాడితే మన దేహంలోని నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఉత్తేజ పరుస్తుందని నిరూపితమైనదని తెలిపారు. తెలుగు భాషలోని తియ్యందనాన్ని, తెలుగు మాటలోని మకరందాన్ని భావి తరాలకు అందించి, తెలుగు భాషా వికాసానికి కృషిచేయాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వారిపై వున్నదని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాల నిమిత్తం ఆంగ్ల భాషపై మక్కువ చూపించినా తెలుగు భాషను మరువరాదన్నారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు పి. ప్రియవర్ధన బాబు మాట్లాడుతూ, తెలుగుభాషా ములాలు చాలా బలమైనవని, ప్రతి తెలుగు వారి పెదాలపై తెలుగు పదాలు తాండవిస్తే మన భాష అజరామమై వెలుగొందునని తెలిపారు. తెలుగు అధ్యాపకురాలు డా. కె. వెంకట రమణమ్మ మాట్లాడుతూ, తల్లి లాంటి మన తెలుగు భాషను కాపాడుకోవాలని, అమృత భాష అయిన తెలుగు భాష, మృత భాష కారాదని, దీనిని సంరక్షించుకోవడం మన బాధ్యతని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.జి. లావణ్య, డా. సి.ఎల్. చెన్నా రెడ్డి, డా. వి. ప్రసన్న లక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి తరం కోసం మొక్కలు నాటాలి

**- మండల విద్యాశాఖ అధికారిణి శైలజా**

**ఓజిలి, మేజర్‌న్యూస్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వన మహోత్సవం కార్యక్రమంలో శుక్రవారం నాడు మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ప్రతి పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని మండల విద్యాశాఖ అధికారిణి శైలజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమ వుతుందని, మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదవడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చునని ఆమె అన్నారు. విద్యార్థి నులు ఇష్టపడి చదివి ఆసక్తి ఉన్నరంగంలో రాణించాలన్నారు. విద్యార్థులు ఏ లక్ష్యం పెట్టుకుని చదువుతున్నారో ఆ లక్ష్యం కోసం నిత్యం చదువుకోవాలన్నారు. ఇప్పటి నుంచి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగితే అది సాధించడం కష్టం ఏమీ కాదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు , విద్యార్థులకు మంచి విద్యను అందించి గొప్ప మేధావులుగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళితే అనుకున్నది సాధించ వచ్చు నన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టు కుని తమ పిల్లలు బాగా చద వాలని పాఠశాలలకు పంపు తుంటారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఇటు తల్లిదండ్రులకు, అటు చదువు నేర్పిన గురువులకు, మండలానికి, పాఠశాలకు కష్టపడి ఇష్టంతో చదివి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిల్లల తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఆమె కోరారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు క్లాస్ రూమ్ ,అబ్జర్వేషన్, బేస్డ్, ఆన్ టీచ్ టూల్ పేరిట శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభ మరింత మెరుగుపడుతుందన్నారు. ముఖ్యంగా తరగతి గదిలో విద్యార్థుల ఏకాగ్రత, పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టేలా సులభతరంగా బోధించేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

టెండరు నోటీస్ నెం: 01/ డి.యమ్. / 2024-25 తేది: 24-08-2024

**టెండరు నోటీస్**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి సాంకేతిక విభాగము నందు **1(ఒక) పనికి గాను కంప్యూటర్లుకు కాట్రిజ్ సప్లయిర్** గాను రిజిష్టరు కంప్యూటర్ సేల్స్ మరియు సర్వీస్ ఏజెన్సీల నుండి ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి వారు సీల్డు టెండర్లు కోరుచున్నారు. దరఖాస్తు దారులు టెండరు ప్రకటన యొక్క పూర్తి వివరములకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, తుడ, తిరుపతి వారిని సంప్రదించవలెను.

సం/- **జి. వెంకటనారాయణ** MSC.,M.A., Ph.D., ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి.

# పరిశ్రమల స్థాపనే లక్ష్యం ఉపాధి కల్పనే ధ్యేయం

**- ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్**



పుత్తూరు, మేజర్ న్యూస్: నగరి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పష్టం చేశారు. ఆయన గురువారం ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ ని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలోని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టి.జి.భరత్ ను కలిసి నగరి నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంత్రిని కలవడం జరిగిందన్నారు. విజయపురం మండలం కోసలనగరంలో పారిశ్రామిక అభివృద్ధి పార్కును ఏర్పాటు చేయాలని, నగరి నియోజకవర్గంలో అధికంగా ఉన్న మరమగ్గ కార్మికుల కోసం టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రిని కోరామన్నారు.

# స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయండి

**స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ - తిరుపతి నగరంలో సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటు చేయాలి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**



**తిరుపతి నగరం, మేజర్‌న్యూస్:** స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయించాలని స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాలు నందు స్మార్ట్ సిటీ ఎండి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ 35వ బోర్డు మీటింగ్ జరిగింది. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మౌర్య వివరించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తుడా ఇంచార్జ్ వి.సి.వెంకట నారాయణ, రామచంద్రారెడ్డి, రమాశ్రీ లు పాల్గొనగా, ఈ అండ్ సి బాలకృష్ణా రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. గత బోర్డు మీటింగ్ నిర్ణయాలు, అకౌంట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయాలని అన్నారు. 70 శాతం పూర్తి అయిన పనులకు నిధులు విడుదల చేసి వెంటనే పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న నిధుల వివరాలను ప్రభుత్వం కు తెలియజేయాలని అన్నారు. నగరంలో సిసి కెమెరా ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో యాత్రికులు, ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, జి.ఎం.చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఎస్పీ నాగభూషణ రావు, డిఎస్పి లు వెంకట నారాయణ, రామకృష్ణ ఆచారి, ఏఇకామ్ ప్రతినిధి బాలాజీ, స్మార్ట్ సిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 31 న పెన్షన్ బట్వాడా చేయండి

**- సచివాలయం సిబ్బందికి కమిషనర్ ఆదేశం**

**పుత్తూరు, మేజర్ న్యూస్:** సామాజిక భద్రత పెన్షన్ లను ఈ నెల 31 వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎన్ రెడ్డి ఆదేశించారు. వాస్తవానికి వచ్చే నెల 1 వ తేదీ పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా సెప్టెంబర్ 1 వ తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ సూచనలతో ఈ నెల 31 వ తేదీ పెన్షన్ పంపిణీ చేయాలని తెలిపారు. క్లస్టర్ వారీగా పెన్షన్ పంపిణీ గురించి రూట్ మ్యాప్ గుర్తించడం జరిగిందన్నారు. ఈ రూట్ మ్యాప్ ఆధారంగా సచివాలయం సిబ్బంది పెన్షన్ దారులకు ఖచ్చితంగా 99 శాతం ఈ నెల 31 వ తేదీ సాయంత్రంలోపు పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే పెన్షన్ తీసుకునే వారు ఎక్కడ వున్నా ఈ నెల 31 వ తేదీ వారి ఇళ్లవద్దే ఉండాలన్నారు.



# జనవాణిలో ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** జనవాణిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జనవాణి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కాసేపు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని నమోదు చేసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని ఫిర్యాదులుదారులకు భరోసా ఇచ్చారు. కాగా సెప్టెంబర్ 9, 10 తేదీల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.



# పింఛనుదారుల ఆన్‌లైన్ పోర్టల్ ఆవిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఉద్యోగుల పారదర్శకతను పెంపొందించే దిశగా పింఛనుదారులు కోసం నూతనంగా ఆవిష్కరించిన ఆన్లైన్ పోర్టల్ ను ఆవిష్కరించినట్లు విశ్వవిద్యాలయం వీసీ తెలిపారు. ఈ పోర్టల్‌ను గురువారం ఇంచార్జి విసి ఆచార్య సిహెచ్. అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్.భూపతి నాయుడు విసి ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ కొత్త పోర్టల్ టీచింగ్, నాన్ టీచింగ్ పెన్షనర్‌లకు పెన్షన్ త్వరితగతిన అందించడానికి రూపొందించామన్నారు. తద్వారా వారి పెన్షన్ వివరాలు, సంబంధిత నెలల్లో క్రెడిట్ చేయబడ్డ తేదీలను తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ యాప్ ద్వారా పింఛనుదారులు వారి ఆర్థిక సమాచారాన్ని వారి ఇళ్ల నుండి సౌకర్యవంతంగా యాక్సెస్ చేయడానికి సమర్థవంతమైన మార్గాన్ని అందిస్తుందన్నారు. ఎస్వీయూ పూర్వ, ప్రస్తుత ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే డిజిటల్ సొల్యూషన్‌లను అవలంబించడానికి ప్రయత్నం జరుగుతోందని, భవిష్యత్తులో, ఉద్యోగులకు ఇలాంటి మరిన్ని సేవలను అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బందికి ప్రయోజనం చేకూర్చే స్నేహపూర్వక పరిపాలనా సంస్కరణలను అమలు చేయడానికి తాము ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, కొత్తగా ప్రారంభించిన పోర్టల్, రాబోయే డిజిటల్ సంస్కరణలు పింఛనుదారులకు ప్రస్తుత సిబ్బందికి విలువైన తాజా సమాచారాన్ని అందిస్తుందన్నారు. మరింత సమాచారం కోసం, పెన్షనర్లు, సిబ్బంది విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించమని లేదా నేరుగా విశ్వవిద్యాలయం ఫైనాన్స్, అకౌంట్స్ బ్రాంచ్‌ని సంప్రదించమని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ,రిటైర్డ్ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు, ఫైనాన్స్ ఆఫీసర్ ఎన్.నగేష్ పాల్గొన్నారు.



# భవానీ శంకర బిందు విగ్రహ ప్రతిష్ఠ

**- దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో శ్రీ సత్య సాయిబాబా మందిరంలో శ్రీ భవాని శంకర బిందు విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. స్వామి ప్రత్యేక దర్శనంలో పాల్గొన్నారు. అనంతరం శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండు రంగారావు సరస్వతమ్మ దంపతులు, దామోదర్ నాయుడు, నాగభూషణం, దాము, సునీల్, చెంగయ్య, మరియు భక్తులు తదితరులు



# తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు వెంకట రామమూర్తి సేవలు చిరస్మరణీయం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరం లోని స్థానిక సుందర రాజపురం విజయం సీబీయస్ఇ పాఠశాల నందు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాషావేత్త పరిశోధకుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాల్గొని కనువిందు చేశారు. విద్యార్థులు "బాలకవులు"గా ముస్తాబై ప్రత్యేకంగా కనిపించగా తెలుగు కవితలు పాటలు గేయాలు, పద్య కీర్తనలు మొదలగు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పరమానందయ్యకథ, సైనికుల త్యాగం, భువన విజయం వంటి నాటికలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ తేజోమూర్తి పాఠశాల కార్యనిర్వాహణాధ్యక్షులు డాక్టర్ శైలజ మూర్తి ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని గూర్చి, గిడుగు వారు చేసిన భాషా కృషిని గూర్చి తెలియజేస్తూ తెలుగు సంస్కృతి చాలా గొప్పదని భాష నిత్యం ప్రవహించే నది లాంటిదని ముఖ్యంగా మన తెలుగు భాష అజరామర భాష అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ వ్యాసరచన, వక్తృత్వం, క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు ఇచ్చి అభినందించారు. ఈ రోజునే మనం జాతీయ క్రీడా దినోత్సవం కూడా జరపడం చాలా విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంపీ దగ్గుమళ్ల





**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని చిత్తూరు ఎం పి దగ్గుమళ్ల ప్రసాద్ రావు అన్నారు.గురువారం ఉదయం జిల్లా క్రీడ మైదానం నందు జిల్లా క్రీడధికారి బాలాజీ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, రాష్ట్ర వాలీబాల్ వైస్ చైర్మన్ జయప్రకాష్,జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిలతో కలసి స్థానిక జిల్లా క్రీడా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడ దినోత్సవంలో బాగంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్తూరు ఎం పి దగ్గు మళ్ల ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి భారత హాకీ మాజీ ఆటగాడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఎంపీ మాట్లాడుతూ బాల బాలికలు చదువుతో పాటుగా క్రీడల్లో కూడా రాణించాలన్నారు.నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చదువుల్లో బాగరాణించాలంటే ముందు దేహ దారుఢ్యం ఉండాలనే విషయం గుర్తించాలి జాతీయ క్రీడ దినోత్సవం వేడుకలలో బాగంగా ఆగస్ట్, 29 న భారత హాకీ మాజీ ఆటగాడు ధ్యాన్ చంద్ 114వ జన్మదినాన్ని జరుపుకుంటాము, ఈ రోజున కృతజ్ఞతతో దేశం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు.భారత హాకీ మాజీ ఆటగాడు మేజర్ ధ్యాన్ చంద్ హాకీ ఆటలో ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాడిగా గౌరవించబడ్డాడని తెలిపారు. మూడు ఒలింపిక్ క్రీడలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు 1928 ఆమ్స్టర్‌డామ్, 1932 లాస్ యాంగిల్స్, 1936 బెర్లిన్‌లో జరిగిన గోల్డ్ విన్నింగ్ ఇండియన్ టీమ్‌లో ముఖ్య మైన ఆటగాడు గా ఉన్నారు. 1932 లాస్ ఏంజిల్స్ యూ ఎస్ ఏ 24-1 యూఎస్ఏ వరల్డ్ రికార్డ్ మొత్తం 3 ఒలింపిక్ టోర్నమెంట్‌లు ధ్యాన్ చంద్ 12 మ్యాచ్‌ల్లో 33 గోల్స్ చేశాడు. 1928-ఆమ్స్టర్‌డామ్ ఒలింపిక్స్-5 మ్యాచ్‌ల్లో 14 గోల్స్ సాధించడం జరిగిందని,అందుకుగాను భారత ప్రభుత్వం ధ్యాన్ చంద్ కు పద్మభూషణ్ అవార్డును ప్రదానం చేసింది, ఇది భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారమని తెలిపారు. ధ్యాన్ చంద్ 1905 ఆగస్టు 29న అలహాబాద్ ఉత్తర ప్రదేశ్ జన్మించారు. పదహారేళ్ల వయసులో ఆర్మీలో చేరాడు. ధ్యాన్ చంద్ 22 సంవత్సరాల 1926-1948 కెరీర్‌లో ప్రపంచంలోని ఇతర హాకీ ఆటగాళ్ల కంటే వెయ్యికి పైగా గోల్స్ చేశాడని తెలిపారు. 1979 డిసెంబర్ 3న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మరణించారు. ఒక సంవత్సరం తరువాత, భారత ప్రభుత్వం అతని గౌరవార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. కేంద్ర రాష్ట్ర క్రీడా సంస్థల ద్వారా జిల్లాకు అవసరమైనక్రిడా కొచ్చుల ను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిత్తూరు జిల్లాకు సంబంధించిన కీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొని, జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లాలో క్రీడలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన బాల బాలికలకు క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలకు జ్ఞాపికను మెడల్స్ ను విద్యార్థులకు ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం జిల్లా క్రీడా మైదానం నుండి కలెక్టర్ బంగ్లా, గాంధీ సర్కిల్ వరకు నిర్వహించే ర్యాలీని ఎంపీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పీ ఈ టీలు, పీడీలు, వివిధ పాఠశాలల బాల బాలికలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని విభాగాల సమన్వయంతో

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

**- అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి**

**తిరుమల మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో విజయవంతం చేయాలని టీటీడీ అదనపు సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు.తిరుమలలోని అన్నమయ్య భవనంలో గురువారం సాయంత్రం టీటీడీ అదనపు ఈవో సమక్షంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లపై సివిఎస్‌వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు టీటీడీ, పోలీసు, సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఉన్న చాలామంది అధికారులకు అనేక బ్రహ్మోత్సవాలను చూసిన, పనిచేసిన అపారమైన అనుభవం ఉందన్నారు. వారి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.ముందుగా టీటీడీ సీవీఎస్‌వో నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎదురయ్యే సవాళ్లు, అధిగమించేందుకు తీసుకోవలసిన చర్యలు, పార్కింగ్ స్థలాలు, రోప్ పార్టీలు, సంబంధిత సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అందించారు.అనంతరం తిరుపతి ఎస్పీ వార్షిక ఉత్సవాల సందర్భంగా తిరుమలకు వచ్చే భక్తులకు చేయనున్న భద్రతా చర్యలను వివరించారు.ఈ సమావేశంలో టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.





# ఆరోగ్య జీవితానికి వ్యాయామం తప్పనిసరి

## : వీసి ఆచార్య కృష్ణమూర్తి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** విద్యార్థులు చదువుతోపాటు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరిగా పాటించి ఆరోగ్యమైన జీవితాన్ని పొందాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విసి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాభారతి, వర్సిటీల ఆధ్వర్యంలో వాక్థాన్ 3.0 ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే, ప్రతి రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని, విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ప్రత్యేకించి వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దానితో పాటుగా ఈ సంవత్సరం నుండి మార్షల్ ఆర్ట్స్ నందు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సహాయక డైరెక్టర్ విశ్వవిద్యాలయ ఉద్యోగులకు, విద్యార్థినీ, విద్యార్థులకు మిక్స్ డబుల్స్ బ్యాడ్మింటన్, మిక్స్ టగ్ ఆఫ్ వార్ క్రీడల పోటీల్లో నిర్వహించి గెలిచిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్యులు రజినీకాంత్ శుక్లా, చీఫ్-వార్డెన్ పి.వెంకట్రావు, ర్యాగింగ్ సెల్ నోడల్ ఆఫీసర్ డా.డి.జ్యోతి, ఎపిఆర్ఓ డా.కనపాల కుమార్, ఎడ్యుకేషన్ ఏఆర్ సాంబశివరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు అటవీశాఖ ఆధర్యంలో వన మహోత్సవం

**- ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే**

**గూడూరు, మేజర్‌న్యూస్:** వన మహోత్సవ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించాలని నాయుడుపేట రేంజ్ అటవీశాఖ అధికారి డివి రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి సబ్ డివిజనల్ అటవీశాఖ అధికారి జాన్‌ప్రకాష్‌రావు, అటవీశాఖ సిబ్బంది, పార్టీ శ్రేణులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

# ఇంటింటి సర్వే నిర్వహించి కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తిస్తున్నాం

**- సెప్టెంబర్ 04 వరకు కంటి సమస్యలు ఉన్న వారికి మెడికల్ క్యాంప్ నిర్వహణ**

**- సమస్య ఉన్న వారికి ఉచితంగా సర్జరీ, కంటి అద్దాలు, మందుల పంపిణీ. : జిల్లా కలెక్టర్.సుమిత్ కుమార్**

**- రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా కుప్పం మున్సిపాలిటీని తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి కృషి**

**- మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.250 కోట్లతో కార్యాచరణ ప్రణాళికా సిద్ధం.. త్వరలో పనుల ప్రారంభం**

**- ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఎం ల ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేసి కంటి సమస్య ప్రాథమికంగా గుర్తింపు**

**- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**



**కుప్పం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం నియోజకవర్గంలో గత వారం నుండి మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ప్రభుత్వ బాలుర పాఠశాల నందు అర్బన్ పరిధిలో నిర్వహించిన కంటి వెలుగు మెగా క్యాంప్ లో జిల్లా కలెక్టర్, ఎం ఎల్ సి డా.కంచర్ల శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేయడం జరిగిందని, నియోజవర్గ పరిధిలో 3 సుమారు లక్షల జనాభాలో దాదాపు 5,500 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం నియోజక వర్గంలో గత వారం నుండి మెడికల్ క్యాంప్ లు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 04 వరకు కొనసాగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా దాదాపు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి అవసరమైన మేర ఉచితంగా కాటరాక్ట్ సర్జరీలు నిర్వహించడం, ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా కంటి అద్దాలు సమకూర్చుతామని, ఆసుపత్రికి వెళ్ళడానికి ఉచిత బస్సు సౌకర్యంతో పాటు ఏ ఎన్ ఎం, ఆశా లను తోడుగా పంపుతామన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కంటి సమస్యలతో పాటు ఉన్న వారు వైద్యం చేయించుకుంటే రానున్న 10-15 సం.లు ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. కంటి సమస్యలతో పాటు బి.పి, షుగర్, కిడ్నీకి సంబంధించి సమస్యలు ఉన్నవారు కూడా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని, వీటికి సంబంధించి మెడికల్ క్యాంప్ లను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి, సమస్య ఉన్న వారిని గుర్తించి వైద్య చికిత్స అందించడం జరుగుతుందన్నారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కుప్పం ప్రజల ఆరోగ్యం పట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గంలో కంటి వెలుగు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఎం ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి 5,575 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని, వారికి మెడికల్ క్యాంప్ లు నిర్వహించి సమస్యను బట్టి కంటి చుక్కల మందు, మాత్రలు అందించి వారిని తిరిగి క్షేమంగా ఇంటికి పంపడం జరుగుతుందన్నారు. కంటి శుక్లాల సమస్య ఉన్న వారు అపోహలకు గురికాకుండా, భయపడకుండా ఆపరేషన్ చేయించుకుని కంటి చూపును కాపాడుకోవాలని కోరారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించడానికి అధికారులతో పాటు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిండానికి తొలి ప్రయత్నం కుప్పం నుండే ప్రారంభిస్తున్నారని, రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా కుప్పం మున్సిపాలిటీని తీర్చిదిద్దేలా రూ.250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ, పార్కుల అభివృద్ధి, రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, త్వరలో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విధ్యాధరి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు డాక్టర్ సురేష్, మనోహర్, సంబంధిత అధికారులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు స్పోర్ట్స్. క్విజ్ పోటీలు




**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో. బుధవారం క్విజ్ ప్రోగ్రాం . జాతీయ క్రీడ దినోత్సవ సందర్భంగా . ధ్యాన్చంద్ జయంతిని) పురస్కరించుకొని అల్లూరి ఆదిశేషరెడ్డి రోటరీ భవనము లో గూడూరు పట్టణంలోని విద్యార్థులకు స్పోర్ట్స్ క్విజ్ ని నిర్వహించారు. ఈ క్విజ్ నందు పట్టణంలోని 16 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ క్విజ్ లో జీవి శంకరయ్య మెమోరియల్ స్కూల్ ప్రథమ బహుమతిని,. సాయి విద్యానికేతన్ స్కూలు ద్వితీయ బహుమతిని, రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమాన్నిఅల్లూరి ఆదిశేషా రెడ్డి రోటరీ ట్రస్ట్ ఫర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి జనార్ధన్ రెడ్డి విచ్చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు ఆటల పట్ల అవగాహన పెంచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాల్సిన అవసరం ఎంతో ఉంది అన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఈ స్పోర్ట్స్ క్విజ్ ను నిర్వహిస్తున్నామని ఈ క్విజ్ ద్వారా విద్యార్థులలో దేశంలోనే క్రీడల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ జి జి నాయుడు , సీనియర్ రొటేరియన్లు దశరధరామిరెడ్డి, పీవీ కృష్ణయ్య మయూరి శ్యామ్, జగదీష్ నాయుడు, రాంప్రసాద్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ క్విజ్ నందు డాక్టర్ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

## రేస్ స్కూల్ లో తెలుగు భాషా దినోత్సవం

**చిల్లకూరు మేజర్ న్యూస్:** మండలంలో, చింతవరం గ్రామములో వున్న రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో గిడుగు వెంకట రామమూర్తి జయంతి నీ పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవంను, ద్యాన్ చంద్ జయంతి సందర్భముగా జాతీయ స్పోర్ట్స్ డే లను జరుపుకొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య తెలుగు భాష యొక్క గొప్పతనము , గిడుగు వెంకట రామమూర్తి గారు గ్రాంథిక భాష నుండి తెలుగును వాడుక భాషలోకి అనువదించడములో ముఖ్య పాత్ర పోషించారని అందుకే ఆయన జయంతి రోజున తెలుగు భాషా దినోత్సవం ను జరుపుకుంటున్నాము అని పిల్లలకు వివరించారు. అంతేకాకుండా ఈ రోజు జాతీయ స్పోర్ట్స్ డే యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు తెలియపరిచినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ గుమ్మడి వెంకట సుబ్బయ్య మరియు కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేశభాషలందు తెలుగు లెస్స:తంబిరెడ్డి మనోహర్ రెడ్డి

**చిట్టమూరు మేజర్ న్యూస్:** దేశభాషలందు తెలుగు లెస్సని టియంఆర్ విద్యా సంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం చిట్టమూరు మండలం కొత్తగుంటలోని తంబిరెడ్డి మనోహర్ రెడ్డి విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషల్లోనే తెలుగుభాష ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. మాతృభాషను ప్రేమిస్తూ ఇతర భాషలను గౌరవించి అభివృద్ధి పథంలో నడవాలన్నారు. చిన్నారుల ఆటపాటలు, వేష ధారణలు అలరించారు. శ్రీకృష్ణదేవరాయలు, మొల్ల, పలువురు కవులు, కళాకారులు, పండితుల వేషధారణలతో తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ విద్యార్థులు ఆలపించిన పద్యాలు, పాటలు,నృత్యాలు అలరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహంతుల్లా,మేనేజర్ ఆశా శ్రీనివాసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

**గూడూరు, మేజర్న్యూస్ :** గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుబాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు గురువారం పాలిచర్లవారిపాళెం ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గిడుగు తెలుగు వ్యహారిక భాష కోసం చేసిన కృషి తెలియచేశారు. గ్రాంధిక భాషలో వున్న తెలుగును ప్రజల భాషలో తీసుకొని రావడం జరిగిందిన్నారు. ఆయన కృషికి గుర్తుగా ఆగష్టు 29,తెలుగుభాషా దినోత్సవం గా ప్రభుత్వం ప్రకటించినదని చిల్లకూరు మండల విధ్యాశాక అధికారి ఎండి రవూఫ్ తెలిపారు. ఆయన తెలుగు భాష కోసం చేసిన సేవ అందరికి ఆదర్శం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, తెలుగు భోధకులు ప్రజెంద్ర ఆదిలక్ష్మి, చైర్మెన్ షకీలా, వేణుగోపాల్రెడ్డి, కామేశ్వరి, చంద్రశేఖర్, మాధవయ్య, విద్వాన్ విశ్రాంత తెలుగు భోధకులు ఏలీయా, కుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు వివిధ అంశాలు లో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## నేడు మల్లాం ఆలయ పాలకమండలి సమావేశం

చిట్టమూరు మేజర్ న్యూస్: మండలంలోని మల్లాంలో వళ్ళీ, దేవసేనా సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సమావేశాన్ని నేడు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి తెలిపారు. పాలక మండలి ఏర్పాటై రెండు సంవత్సరాల పదవీకాలం నేటితో ముగియనుండడంతో చిట్ట చివరిగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో తరించి,ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలందించి, భాగస్వామ్యులైన వారు, స్వామి సేవకులు, ఈ ప్రాంత ప్రజలు, స్థానికులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

# టీటీడీలో సామాన్యుల గురించి పట్టించుకోండి -వాటాలు మానండి

### - అధికార పార్టీ నేతలకు రౌండ్ టేబుల్ సమావేశంలో విజ్ఞప్తి



**తిరుపతి (అర్బన్), మేజర్న్యూస్:** టీటీడీలో వాటాల గురించి కొట్లాటలు మానుకుని సామాన్యుల గురించి పట్టించుకోవాలని అధికార పార్టీ కూటమి నేతలకు రౌండ్ టేబుల్ సమావేశం విజ్ఞప్తి చేసింది. సిఐటియు ఆధ్వర్యంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు సాగిస్తున్న నిరసన దీక్ష గురువారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీవారి మెట్టు వ్యాపారులకు మద్దతుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నేతలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రసంగించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ టిటిడి లో సాగుతున్న దందాలలో మార్పేమి లేదని,సామాన్యుల పట్ల కనీస స్పందన కూడా లేదని ఆరోపించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణలు ప్రసంగిస్తూ..తిరుమల కొండపై రాజకీయాలు వద్దంటూనే రాజకీయ నేతల చేతుల్లో నిర్ణయాలు బందీగా మారిపోయాయని ఆరోపించారు. ఆఖరికి తట్టలు పెట్టుకుని అమ్ముకునే వ్యాపారాల నుంచి పై స్థాయి టెండర్ల దాకా వీరి జోక్యం లేకుండా ఏమీ సాగటం లేదని అన్నారు.శ్రీవారి మెట్టు వ్యాపారులు గత 20 ఏళ్లకు పైగా శ్రీవారి మెట్టు మార్గంలో సమోసాలు, బొరుగులు, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్,కుంకుమ భరిణలు వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని టీటీడీ యాజమాన్యానికి పలు రకాలుగా ఉపయోగపడుతున్నారని ప్రస్తావించారు. ఎర్రచందనం స్మగ్లర్లను 166 మందిని వివిధ సందర్భాల్లో పట్టుకుని టీటీడీకి,ప్రభుత్వానికి చిరు వ్యాపారులు పట్టించారని గుర్తు చేశారు. భక్తులకు అత్యవసర పరిస్థితులలో తోడ్పడుతున్నారని, తిరుమల అడవులు తగలబడి పోతున్నప్పుడు ఆర్పడానికి సాయపడ్డారని తెలిపారు. టీటీడీ ఈవో శ్యామలరావు సామాన్యుల గురించి పట్టించుకోవాలని కోరారు. అలిపిరిలో చిరుత పులి పసి పాపపై దాడి చేస్తే... అలిపిరిలో అంగళ్లు సాగుతుండగా, శ్రీవారి మెట్టు మార్గంలో పేదల వ్యాపారాలను మూసివేయడం ఏ రకమైన న్యాయమో తెలపాలని కోరారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు టి. సుబ్రహ్మణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. సాయిలక్ష్మి,ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి. చినబాబు,ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హేమలత,సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఆర్. లక్ష్మి,తిరుపతి నగర పరిరక్షణ కమిటీ నాయకులు డిఎంసి భాస్కర్,సిఐటియు జిల్లా కార్యదర్శి మునిరాజ,ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గండికోట చినబాబు,సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్,హాకర్స్ యూనియన్ కార్యదర్శి బుజ్జి,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, డివైఎఫ్ఐజిల్లా సహాయ కార్యదర్శి జయంత్, ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు శివ,తంజావూరు మురళి, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ నేతలు గంగులప్ప, చంద్రశేఖర భాగవతార్, తదితరులు మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున,లోకనాథం, చిరంజీవి,నరసింహ, సోను,మెగిలప్ప, రాంబాబు,గణేష్, ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**దొరవారిసత్రం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేణుంభాకం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలను గురువారం స్థానిక ఎంఈఓ-2 కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాలకు చెందిన వివిధ రికార్డులను పరిశీలించి విద్యార్థుల యొక్క విద్యా విధానాన్ని గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు అంతేకాకుండా,విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూడడం జరిగింది. వీరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## వైభవంగా తెలుగు, క్రీడా దినోత్సవం



**యాదమరి, మేజర్ న్యూస్:** యాదమరి మండలం లోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ నందు తెలుగుభాషా మరియు క్రీడా దినోత్సవం పండుగ వాతావరణంలో వైభవంగా నిర్వహించి నారు పిన్సిపాల్ హెచ్. యం ఎ.పి.లలిత తెలియ జేసినారు. ఆమె మాట్లాడుతూ తెలుగుభాషా గొప్పతనాన్ని ,దేశభాషలందు తెలుగు లెస్స మన పెద్దలు నగ్న సత్యాన్ని తెలియజేసినారు. వ్యాస రచన, వకృత్యపు, పద్య పఠనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు,సాంస్కృతిక కార్యక్రమాలలో మొదటి, ద్వితీయ స్థానం వారికి గణితోపాధ్యయులు కె.కనకాచారి నగదు బహుమతి ఇవ్వడం,అలాగే సబిత, మంజులత కూడ విద్యార్థులను పోత్స హించడం జరిగింది .చివరిగా తెలుగు విభాగం వారు ఉపాధ్యాయులకు,విద్యార్థులు స్వీట్స్ పంపిణి చేయడంతోకార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈకార్యక్రమంలో భాస్కర్ రెడ్డి,సుల్తాన్, కనకాచారి,మదన్ మోహన్, మధుసూదన్, తెలుగు ఉపాధ్యాయులు మహేష్ బాబు, షణ్ముగం, నీలవేణి, మంజుల, రాజరాజేశ్వరి, మురళిధరన్, పి.డి. చిట్టి బాబు జి.భారతి,వాణి ,ఉపాధ్యయ బృందం, విద్యార్థులు పాల్గోన్నారు. ఈకార్యక్రమం ను కమిటీ చైర్మన్ నవీన్, వైస్ చైర్మన్ అమని ముఖ్య అతిధులుగా విచ్చేసినారు.



### ఆధునిక తెలుగు సాహిత్యానికి

# వైతాళికులు గిడుగు

**పెళ్లకూరు, మేజర్ న్యూస్:** ఆధునిక తెలుగు సాహిత్యానికి వైతాళికులు కవి గిడుగు వెంకట రామమూర్తి అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంబేడు తెలుగు పండిట్ పసల రమణయ్య అన్నారు.గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ప్రధాన ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం అంతా కలిసి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తెలుగు పండిట్ రమణయ్య మాట్లాడుతూ తెలుగు తీయదనాన్ని సామాన్యులకు చేరువ చేయుటలో గిడుగు వెంకట రామమూర్తి కృషి చేశారన్నారు.పైగా వాడుకు భాష ఉద్యమానికి ఆధ్యులు బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు అన్నారు.ఉపాధ్యాయ వృత్తి చేపట్టి తెలుగులో అనేక రచనలు చేశారన్నారు.ప్రధానంగా నన్నయ,తిక్కన, ఎర్ర ప్రగడ,తెనాలి రామకృష్ణ,గిడుగు వెంకట రామమూర్తి తదితర కవులు తెలుగులో అనేక రచనలు చేసి జాతి గౌరవాన్ని,తెలుగు భాష స్థాయిని పెంచిన ఘనత వారిది అన్నారు.దేశభాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అంటూ ఆయన గుర్తు చేశారు.అయితే ప్రస్తుతం ఆంగ్ల బాష పట్ల మోజు పెరగడంతో తెలుగు భాష ఉనికి తగ్గడం పట్ల పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం ఇంట్లో కూడా తెలుగు భాషను మాట్లాడుకునే పరిస్థితి లేకుండా పోతున్నట్టు చెప్పారు.ఈ విధానం మారి తెలుగు భాష ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.అదేవిదంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్వాయిపాడు నందు ప్రధాన ఉపాధ్యాయులు దొరస్వామి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవ వేడుకలు, తెలుగుబాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మండల కేంద్రంలోని ఆర్ కె ఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న భౌతికశాస్త్రం బోధించడానికి అతిధి అధ్యాపకుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి స్వరూప తెలిపారు భౌతిక శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేసి 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు ఈనెల 31 తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. సెప్టెంబర్ రెండో తారీఖున సోమవారం నేరుగా తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## భారత హాకీ శిఖరం ధ్యాన్ చంద్



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** ప్రపంచ హాకీ మాంత్రికుడు, భారత హాకీ శిఖరం ధ్యాన్ చంద్ అని డీ.ఎం.పురం ప్రధానోపాధ్యాయులు కేశవులు పేర్కొన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ధ్యాన్ చంద్ జయంతి ఘనంగా నిర్వహించారు. వ్యాయమ ఉపాధ్యాయులు తిరుమల రాజు ధ్యాన్ చంద్ భారత హాకీ ఉన్నత శిఖరాలకు చేర్చిన విధానాన్ని ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. నాలుగు రోజులనుండి నిర్వహించిన ఆటలపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దుర్యోధన వేషధారి ధరణి కుమార్ హాకీ ఆట ఆడి ఆహుతులను అలరించారు. విద్యార్థులు భారత హాకీ శిఖరం అంటూ చేసిన పిరమిడ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వ్యాయమఉపాధ్యాయులు తిరుమల రాజు, సుబ్రమణ్యం రెడ్డి, చిన్నయ్య చెట్టి,వెంకటరమణయ్య, దిల్లిబాబు, రాములు, రంజిత్ కుమార్, సరస్వతి, హరిత, మాలతి, సుమతీ, పాఠశాల చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్యారాణి మరియు సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో కేఎస్జీ విద్యార్థుల ప్రతిభ



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన అథ్లెటిక్స్ సౌత్ జోన్ అండర్-14 బాల బాలికల పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణం కాసాగార్డెన్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఐ.వాసంతి హై జంప్ లో మొదటి స్థానం, జి.లాలిత్య, సీ. సుకన్య రన్నింగ్ లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో గురువారం నిర్వహించిన మాతృభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చూపి జాతీయస్థాయిలో సత్తా చాటాలని ప్రిన్సిపాల్ ప్రభావతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాయుడుపేట బాషా హై స్కూల్ లో నేషనల్ స్పోర్ట్స్ డే




**నాయుడు పేట, మేజర్‌న్యూస్:** నాయుడు పేట మున్సిపల్ పరిధిలోని భాషా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు నిర్వహించిన లినేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమంలో నాయుడు పేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రఫీని భాషా స్కూల్ కరస్పాండెంట్ షేక్ రఫీ భాషా శాలువాతో సత్కరించారు. (భాషా ప్రీమియర్ లీగ్)క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించిన ఈ టోర్నమెంట్లో గెలుపొందినటువంటి విద్యార్థులకు బహుమతులు మరియు ట్రోఫీలు లినాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీలి అందించారు. ఈ సందర్భంగా 786రఫీ మాట్లాడుతూ...నేషనల్ స్పోర్ట్స్ డే ని ఇంత ఘనంగా నిర్వహించినటువంటి భాషా స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదములు.. ఎప్పుడైతే విద్యార్థులకు మానసికంగా మరియు శారీరకంగా దృఢంగా ఉంటారో అప్పుడే వాళ్ళు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని తెలియజేశారు. అలా ఉండాలి అంటే స్పోర్ట్స్ అనేది చాలా ఇంపార్టెంట్..అని తెలియచేసారు.. ఈ కార్యక్రమంలో లిహాజీ రహంతుల్లాలి స్కూల్స్ ప్రిన్సిపాల్ మరియు టీచర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ అజయ్ కుమార్



**దొరవారిసత్రం, మేజర్ న్యూస్:** దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో ఎస్ ఐ అజయ్ కుమార్ గురువారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గత ప్రభుత్వంలో గూడూరు డివిజన్, మనుబోలు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రభుత్వం పోలీసు శాఖలో చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా దొరవారిసత్రంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై తిరుమల రావును తిరుపతి వి ఆర్ కు పంపినట్లు ఆ శాఖ అధికారుల సమాచారం. ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో దొంగతనాలు, కోడి పంద్యాలు, పేకాట, గంజాయి లాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నేరాలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. అంతేకాకుండా, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.

## సచివాలయం వ్యవస్థలో శాఖలు ఉద్యోగులకు బదిలీలు అవకాశం కల్పించాలి

**- సచివాలయం ఉద్యోగులు సమాఖ్య**
**రాష్ట్ర అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులుకు అన్ని శాఖలకు బదిలీల అవకాశం కల్పించాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబందించిన వివిధ శాఖలకు సంబంధించినటువంటి ఉద్యోగులకు బదిలీలలో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము అన్నారు. గతంలో ఇచ్చినటువంటి బదిలీలలో కూడా గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమల శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన వారికి బదిలీలు అవకాశం కల్పించలేదు కావున ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని వారికి బదిలీల అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరము. అంతర్ జిల్లాల బదిలీలో గతంలో కేవలం స్పౌజ్ మ్యూచువల్ మాత్రమే ఇవ్వడం ప్రస్తుతం ఎటువంటి అంతర్ జిల్లాలు బదిలీలుకు సంబంధించి నియమ నిబంధనలు రూపొందించనందు వల్ల వివిధ జిల్లాల్లో విద్య ఆధారంగా లోకల్ క్యాటగిరిలో ఉద్యోగం చేస్తున్నవారు కుటుంబాలకు దూరంగా ఉండి ఇతర జిల్లాలో ఉద్యోగాలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు కావునా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచన చేసి అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

## ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్ డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా సెప్టెంబర్ నెల 3వ తేది మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐ టి ఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించబడును అని చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యమ్. గుణశేఖర్ రెడ్డి గారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో జాన్సన్ లిఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కె ఎల్ గ్రూప్, అమెజాన్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు జాబ్ మేళా లో పాల్గొంటున్నారు. మేళాలో ఉద్యోగ అవకాశం కోసం వచ్చే అభ్యర్థుల కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐ టి ఐ,డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 సం" నుండి 35 సం" మధ్య వయస్సు కలిగిన స్త్రీ పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు రూపేష్ 9160940479, లోకేష్9963561755.

## రాజనాల బండ హుండీ ఆదాయం లెక్కింపు



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాజనాలబండ శ్రీ వీరాంజనేయ దేవస్థానంలో గురువారం జరిగిన స్వామివారి హుండీ లెక్కింపు ఏ.ఈ.ఓ మునికృష్ణారెడ్డి ఆద్వర్యంలో జరిగింది. ఈ హుండీ లెక్కింపులో అక్షరాల లక్షా తొంబైతొమ్మిదివేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓజిలి నూతన ఎస్సైగా కె. స్వప్న



**ఓజిలి, మేజర్ న్యూస్:** ఓజిలి నూతన ఎస్సైగా కె. స్వప్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ వృత్తిలో ఉత్తమ విలువలు కలిగిన అధికారిణిగా ఉన్నత స్థాయి అధికారులుచే గుర్తింపు తెచ్చుకున్నారు. ఎస్సై కె. స్వప్న వృత్తిపట్ల నిబద్ధత నిజాయితీ ఫ్రెండ్లీ పోలీస్ తోపాటు శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తూ అసాంఘికగా కార్యకలాపాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తూ శభాష్ పోలీస్ అంటే ఇలా ఉండాలని అందరి నోట జేజేలు అందుకుంటూ గ్రేట్ పోలీస్ అధికారిణి గా గుర్తింపు పొందారు. ఓజిలి నూతన ఎస్ఐ గాబాధ్యతలు స్వీకరించిన ఈ సందర్భంగా నూతన ఎస్ఐ కె. స్వప్న మాట్లాడుతూ ఓజిలి మండలంలో నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానని ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని. యువకులు చెడు వ్యాసనాలను దూరంగా ఉండాలని ఎస్ఐ కె. స్వప్న సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## పాఠశాలను సందర్శించిన వైద్యబృదం



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలం లోని చారాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రాగునీరు సక్రమంగా లేనందున విద్యార్థిని, విద్యార్థులు ఇద్దరు ముగ్గురు జలుబు,జ్వరం తో బాదపడుచున్నారని తెలిసిన వెంటనే చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు కుమారి డాక్టర్ పూజ,డాక్టర్ నవీన్ మరియు లద్దిగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ నేతృత్వం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చారాలను సందర్శించడం జరిగింది. ఐతే అక్కడ ప్రధానోపాధ్యాయులు సురేంద్ర బాబు పాఠశాలలో జ్వరపీడితులు ఎవరూ లేరని తెల్పారు. ఐతే వైద్యబృదం విద్యార్థిని విద్యార్థులకు గల మంచినీటి సౌకర్యాల పై చర్చించి,వ్యక్తిగత శుభ్రత గురించి తెలియజేశారు. అనంతరం ఒక బాలుడికి అరచేతి పైన బొబ్బర్లు లాగ ఉండటంతో వాటికి చికిత్స అందించడం జరిగింది,అంతే కాకుండావిద్యార్థిని,విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని వారు తెలియజేశారు. ఈ విషయం పై మీడియా మిత్రులు ప్రధానోపాధ్యాయుని ఆర్.ఓ ప్లాంట్ విషయం అడుగగా రిపేరుకోసం మెయిల్ పెట్టామని చెప్పారు. ఐతే కొందరు విద్యార్థిని,విద్యార్థులు త్రాగునీరు లేక పాఠశాల ప్రక్కన గల ఇండ్లవద్దకు వెళ్ళి త్రాగునీరు తెచ్చుకుంటుంన్నారు. ఆర్.ఓ ప్లాంటు కు సంబందించి ఎన్నిసార్లు విన్నవించిననూ పట్టించుకున్నదాఖలాలు లేవని తల్లిదండ్రులు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృదం తో పాటు యం. యల్. హెచ్ పి నీరజ, ఏ.యన్.యం.ఉషా,పి. హెచ్.యన్ కృష్ణవేణి, బహువుద్దిన్, ఆశకార్యకర్త మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కైవరం తాత ఉత్సవం

**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం మండలం,ఎన్.కొత్తపల్లి పంచాయితీ, కుంజేగౌనూరు గ్రామంలోనీ బలిజ సంఘం, కైవరం తాత గురువుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయల ఉత్సవమును ఘనంగా నిర్వహించారు. అదే విధంగా కుంజేగానూరు గ్రామస్తుల ఆద్వర్యంలో 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టు ప్రక్కల సుమారు 10 గ్రామాల బలిజ కుటుంబ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా కైవరం నుండి తాత విగ్రహాన్ని పురోహితులు తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అత్యంత వైభవంగా జరిపించారు. కైవారం నుండీ సుమారు 600 లడ్డులను భక్తులకు ప్రసాదంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ మునిరత్నం,రూరల్ బలిజ సంఘం అధ్యక్షులు డీలర్ వెంకటేష్, కుంజేగానూరు వెంకటేష్,చలపతి, కృష్ణమూర్తి, సద్గురు యోగి నారాయణ బలిజ సేవ ట్రస్ట్ అధ్యక్షులు ప్రభాకర్, సంఘ నాయకులు గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, సోమశేఖర్, అనసూయమ్మ, సుగుణమ్మ, భాగ్యలక్ష్మి త్రిలోక్, రాజేంద్ర, రాధాకృష్ణ, శేషగిరి,మంజునాథ్, లోకేష్ మరియు కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పంలో ఉన్న బలిజ సంఘం సభ్యులు పెద్ద ఎత్తునా పాల్గొన్నారు.






### టాటా మోటార్స్ కొత్త

# కర్వ ఎలక్ట్రికల్ కారు ఆవిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** విజయభారతి ఆటో మొబైల్స్ షోరూంలో గురువారం సరికొత్త టాటా మోటార్స్ వారి రెండు కర్వ ఈవీ ఎలక్ట్రికల్ కార్లను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి ఆదినారాయణ హాజరై నూతన టాటా మోటార్స్ కర్వ ఎలక్ట్రికల్ కార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ వాహనాలను వాడేవారు. చార్జింగ్ విషయంలో జాగృత పాటించాలని సూచరించారు. అషోరూం అధినేత ఎస్.వెంకటరామన్ మాట్లాడుతూ టాటా మోటార్స్ వారు. ప్రజలకు అనువుగా ఆధునిక టెక్నాలజీతో కరు ఎలక్ట్రికల్ వాహనాలను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ కొత్త కార్లు 45 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ, 502 కిలోమీటర్ల డ్రైవర్లోంజ్, 55 కేడబ్ల్యూ హెచ్ బ్యాటరీ 585 కిలోమీటర్ల డ్రైవర్ రేంజ్ సదుపాయం ఉందన్నారు. అంతేకాక 6 ఎయిర్ బ్యాగ్లు, అడాస్ లెవెల్ 2 టెక్నాలజీ, పనారోమిక్ సన్రూప్ వాయిస్ అసిస్టెడ్, హార్మాన్ సౌండ్ సిస్టమ్, 300 డిగ్రీ 3డీ సోరౌండ్ వ్యూ కెమెరా, కొత్త ఫ్లష్ హ్యాండిల్స్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అలాగే 6వేస్లో సర్దుబాటు పవర్ డ్రైవర్ సీటేఉ, వెంటిలేటెడ్ సీట్లుల్ల, 3 డ్రైవింగ్ మోడల్స్, వెనుక ఏసీ వెంట్లు వంటి సదుపాయాలు కలిగి 15 నిమిషాల పాస్ట్ చార్జింగ్తో 150 కిలోమీటర్ల ప్రయాణించే సౌలభ్యంతో ఈ టాటా మోటార్స్ వారు కొత్త కార్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టాటా కస్టమర్ కేర్ విభాగాధిపతి హరివెంకటేష్, ఎస్బీఐ తిరుపతి రీజియన్ మేనేజన్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర లలిత, ఆటోమొబైల్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రాంధిక భాషను తెలుగులోకి తెచ్చిన

# మహనీయుడు గిడుగు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** గ్రాంధిక భాషలో వున్న తెలుగును ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి తెలుగు భాషలోని మకరందాన్ని సులభతరంగా ప్రజలకు అందించిన మహనీయులు గిడుగు రామమూర్తి అని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్ బాబు కొనియాడారు. తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవంగా టిటిడి శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల తెలుగు విభాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన వహించి ప్రసంగిస్తూ, గ్రాంధిక భాషలో వున్న తెలుగును ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి తెలుగు భాషలోని మకరందాన్ని సులభతరంగా ప్రజలకు అందించిన మహనీయులు గిడుగు రామమూర్తి అన్నారు. ప్రపంచ భాషల్లోనే తెలుగు భాష, లిపి ప్రత్యేకత కలిగినదని, భావ వ్యక్తీకరణకు అత్యంత సులభతరమైన భాషగా గుర్తింపు వున్నదన్నారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు పి.ప్రియవర్ధన బాబు మాట్లాడుతూ తెలుగుభాషా ములాలు చాలా బలమైనవని, ప్రతి తెలుగు వారి పెదాలపై తెలుగు పదాలు తాండవిస్తే మన భాష అజరామమై వెలుగొందునని తెలిపారు. తెలుగు అధ్యాపకురాలు డా. కె. వెంకట రమణమ్మ మాట్లాడుతూ తల్లి లాంటి మన తెలుగు భాషను కాపాడుకోవాలని, అమృత భాష అయిన తెలుగు భాష, మృత భాష కారాదని, దీనిని సంరక్షించుకోవడం మన బాధ్యతని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.జి. లావణ్య, డా. సి.ఎల్. చెన్నా రెడ్డి, డా. వి. ప్రసన్న లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# మా తల్లికిచ్చిన గిఫ్ట్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు

**- మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల ఆక్రమణలు ఎక్కువయ్యాయి**
**- అవిలాల గ్రామపంచాయతీ బాధితుల ఆరోపణ**

**తిరుపతి కల్చరల్ మేజర్న్యూస్:** తిరుపతి రూరల్ మండలంలోని అవిలాల గ్రామపంచాయతీకి సంబంధించిన సర్వేనెంబర్ 15 లో తమ తల్లికి తాతగారు రెండు ఎకరాల గిఫ్ట్ ఇస్తే ఆ స్థలాన్ని పెద్దిరెడ్డి అనుచరుడు రఘునాథ్ రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని చిన్న పెద్ద రెడ్డిములు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తమ స్థలములో జెసిబి తో రఘునాథ్ రెడ్డి సుభ్రపరచడానికి వస్తే చిన్న రెడ్డమ్మ పెద్ద రెడ్డమ్మ అడ్డుకున్నారు. కొచ్చి శేషగిరి మాట్లాడుతూ తండ్రి తాతల హంతీరామంజీ మఠం వారికి బ్రిటిష్ కాలము 99 సంవత్సరాలు లీజుకు ఇచ్చినట్లు వారు వివరించారు. కొచ్చి శేషగిరి స్వామి మాట్లాడుతూ తండ్రి తాత శేషగిరి 175 ఎకరాలు హైకోర్టు నడుస్తుందని దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు చెప్పారు భూమిలో తన తల్లి గారికి రెండు ఎకరాలు గిఫ్ట్ గా ఇచ్చారని వారు వివరించారు. వీటిపై కొందరు ఆక్రమించుకోవడానికి రావడంతో తాము కోర్టును ఆశ్రయించినట్లు





వారు తెలిపారు. ఈ స్థలానికి తిరుపతి కోర్టులో నడుస్తుందని వారి తండ్రి గంగిరెడ్డి కోర్టులో తమ కేసును చూసే వారిని అయితే తమ తండ్రి మరణించిన తర్వాత రఘునాథరెడ్డి మాకు అమ్మేసారని దౌర్జన్యంగా తమపై విరుచుకుపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లి గాని తాము గాని ఎక్కడ అమ్మలేదని అమ్మినట్లు రికార్డులు కూడా చూపించకుండా ఇలాంటి దౌర్జన్యం చేయడం బాధాకరమన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పుడు ఇలాంటి దౌర్జన్ చేయడం మంచి పద్ధతి కాదని వీటిపై తమ కోర్టులో తమ వాదన వినిపిస్తున్నట్లు వారు వివరించారు. అయితే స్థానిక నాయకులు పోలీసులు తమ ఆవేదన గుర్తించి తమకు న్యాయం చేయాల్సిందిగా వారు కోరారు.

### విద్యార్థి దశ నుండే చదువుతో పాటు

# క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**- క్రీడలు, వ్యాయామం ఒక భాగంగా అలవర్చుకోవాలి : కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్న్యూస్:** విద్యార్థి దశ నుండే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామం ఒక భాగంగా అలవర్చుకోవాలి అని తద్వారా శారీరక మానసిక దృఢత్వం తో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు అవుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన చంద్ జయంతి పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడల దినోత్సవం 2024 నిర్వహణ నేపథ్యంలో స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ నుండి మహతి ఆడిటోరియం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన చంద్ జయంతి పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడల దినోత్సవ దినోత్సవం 2024 ను నిర్వహించుకోవడం జరుగుతోందని భారత హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ గొప్ప హాకీ ప్లేయర్ అని, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరిగిన ఒలింపిక్స్ క్రీడలలో వారి స్ఫూర్తితో 8 గోల్డ్ మెడల్స్ సాధించడం ఒక ఎనలేని ఘనత అని తెలిపారు. ఈ నెల 26 నుండి పలు క్రీడల పోటీలు, యితర పోటీలు కళాశాలల్లో, పాఠశాలల్లో నిర్వహించి క్రీడలను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగింది అని ఆయన తెలిపారు. ఈ మధ్య కాలంలో ప్రజలు, యువత వారి దైనందిన జీవితంలో ఉంటున్న వర్క్ స్ట్రెస్ వలన, మానసిక వొత్తిడి వలన, సెల్ ఫోన్, సోషల్ మీడియా వంటి వాటి మితిమీరి వాడకం తదితరాల వలన, క్రీడల పట్ల ఆసక్తి, సమయం కేటాయించడం, శారీరక వ్యాయామం తగ్గిందని తద్వారా చిన్న వయసు నుండే బిపి లు, డయాబెటిస్ వంటి పలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వీటి నుండి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలు, వ్యాయామానికి కనీసం 30 నిమిషాలు కేటాయించాలని తద్వారా ఆరోగ్యకరమైన మంచి సమాజం ఏర్పాటు అవుతుందని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, వ్యాయామం దైనందిన జీవితంలో విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలి అని సూచిస్తూ, తద్వారా శారీరక, మానసిక దృఢత్వమే కాకుండా, టీమ్ స్పిరిట్, కాన్ఫిడెన్స్ స్థాయిలు పెరుగుతాయని తెలిపారు. జిల్లాలోని టీచర్లు, పీఈటీ లు క్రీడా మైదానాలు ఉన్నా లేకున్నా క్రమం తప్పకుండా విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ర్యాలీ ప్రారంభానికి ముందుగా ధ్యాన్ చంద్ చిత్ర పటానికి కలెక్టర్ పూల మాల వేసి, అందరితో క్రీడలపై ప్రతిజ్ఞ చేయించారు. స్పోర్ట్స్ స్టేడియం నందు క్రికెట్, స్విమ్మింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్ కోర్టు వంటి పలు వాటిని కలెక్టర్ డిఎస్డిఓతో కలిసి పరిశీలించి పలువురు క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుమారి దండు పూజ ఇంటర్నేషనల్ షటిల్ ప్లేయర్ మరియు 73వ నేషనల్ గేమ్స్ గోవా నందు మిక్స్ డబుల్స్ పోటీలో గోల్డ్ మెడల్ గ్రహీతను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి డైరెక్టర్ ఎస్వియు, జయచంద్ర డైరెక్టర్, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, జిల్లా మాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ఎన్సిసి అధికారులు, వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి, సీనియర్ సిటిజన్లు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ నెల సామాజిక పెన్షన్లు ఆగస్టు 31 నే పంపిణీ

**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్న్యూస్:** ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే సెప్టెంబర్ నెల ఫించన్ లను ఈ నెల 31శనివారం నే పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి నెలా 1వ తేదీన " పేదల సేవలో" కార్యక్రమం క్రింద పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో ఈ నెల 31వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రభు త్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సామాజిక పెన్షన్లు ఆగస్టు 31వ తేదీన అందకపోతే సెప్టెం బర్ 2వ తేదీన సోమవారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

జనం కోసమే
శ్రీ దినపత్రిక సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116